# ముందడుగు

-ఎం. వెంకటేశ్వరరావు



"అమ్మా! అన్నయ్య కోసం ఎవరో వచ్చారు" స్కూలుకు బయిలుదేరుతూ తల్లితో చెప్పింది పద్మ.

"వాణ్ణి నాలుగు మెతుకులు నోట్లో వేసుకోనిచ్చేట్టు లేదు" అంటూ బయటకెళ్లి వచ్చిన వ్యక్తితో అమ్మ చెబుతున్న మాటలు నాకు వినిపిస్తూనే వున్నాయి.

"ఉదయమొచ్చినా ఇదేమాట, సాయంత్రం వచ్చినా ఇదేమాట. అయినా ఆఫీసుకి బయల్దేరే టైంలో ఎక్కడికెళ్తాడమ్మా? అప్పు తీసుకునేటప్పుడుండే తొందర ఇచ్చేటప్పుడు ఉండాలి."

"ఇంట్లో లేడు సాయంత్రం రండి."

టైము 9.45 అయింది. ఇప్పుడు బయలుదేరినా ఆఫీసుకి చేరేసరికి పదవుతుంది.

చెయ్యి కడుక్కుని బయటకొచ్చాను.

నన్ను చూసిన ఆ వ్యక్తి "ఏంటయ్యా పంతులూ! మీ నాయనలాగా ఇంట్లో వుండి లేడని చెప్పిస్తున్నావు. ఆయన కొడుకువన్పించావు" అంటుంటే- అమ్మ నావైపు మ్రాన్పడినట్టు చూసి లోపలికెళ్లింది.

అతనికి సర్దిచెప్పి పంపేసరికి మరో పదినిముషాలు ముందుకు కదిలాయి. ఐదు నిముషాల్లో ఆఫీసుకు చేరుకోవాలి. మౌనంగా లోపలికొచ్చి డ్రెస్ వేసుకుంటున్న నాతో-

"ఇంతలోనే నువ్వు బయటకొచ్చి అతని ముందు నన్ను అవమానపరచకపోతే కొంపలు మునిగిపోతాయా?" అంది అమ్మ కోపంగా.

"అమ్మా! నీకివన్నీ సహజంగా ఉండొచ్చు. కానీ నాకు అసహ్యం. నా మనసుకి విరుద్ధం. చిన్నప్పటి నుంచీ ఇవే మాటలు వినీ వినీ విసుగెత్తుతోంది. వద్దమ్మా ఇహమీదొద్దు. దయచేసి నలుగురి ముందూ నన్ను దోషిగా మార్చవద్దు" అని వాచ్‌వంక చూసేసరికి ఆఫీసు టైం దాటిపోవడంతో వేగంగా బయటకు కదిలాను.

• • •

అన్యమనస్కంగా ఆఫీసులో అడుగుపెట్టిన నేను ఆఫీసరు వార్నింగ్‌ని మౌనంగా స్వీకరించి సీట్లో కూలబడ్డాను. చదివిన చదువుకు సంబంధంలేని ఉద్యోగం. అధ్యాపకుడిగా పదవీ విరమణకు ముందే అంతిమ శ్వాస వదిలిన మా నాన్నకు బదులు మా కుటుంబానికందిన అక్షయపాత్ర నా ఉద్యోగం.

కంపాసినేట్ గ్రౌండ్స్‌లో సీనియారిటీ వరుసలో మండల ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగంలో తలదూర్చేసరికి తాతలు దిగొచ్చారు.

నాన్న మిగిల్చిపోయిన అప్పులకి ఆయన గ్రాట్యుటీ, పిఎఫ్‌ల రూపంలో వచ్చిన లక్షన్నర రూపాయలు చాల్లేదు. రెండో అక్కయ్యకు కుదిరిన సంబంధం సంవత్సరానిగ్గానీ పెళ్లిరూపం దాల్చలేదు.

ముప్పయి రోజులూ జీతం కోసం నిరీక్షణ. అందుకున్న మూడోనాటినుంచే సంఘర్షణ. పైపెదవి విప్పి పైకి చెప్పుకోలేని నిస్సహాయత సంవత్సరంన్నర ఉద్యోగానుభవంలో నాకూ అలవడింది. పరవళ్ళు తొక్కే యవ్వనం పాతికేళ్లకే పడుతూ లేస్తూ పండిపోతున్నట్లనిపిస్తోందిరా న్నానూ. నా ఆలోచనలకడ్డొస్తూ-

"సూర్యం! జన్మభూమి ప్రోగ్రాం సర్క్యులర్సు అన్ని గ్రామాలకీ పంపావా?" అడిగాడు ఎమ్మార్వో.

"నిన్ననే పంపాన్సార్."

"రేపు ఉదయం మనమూ కలెక్టర్‌తోపాటు గ్రామాలకి వెళ్లాలి. నువ్వు ఐదుగంటలకే మా ఇంటికొచ్చేయ్. ఈ పేపర్సు టైపుచేసి పట్రా."

• • •

ఆ సాయంత్రం ఇంటికొస్తుంటే-

"ఏమోయ్ సూర్యం" పిలుపు విని ఆగి-

"మీరా అంకుల్" అన్నాను నన్ను సమీపించిన రాజారావుగారితో.

"వారంరోజులుగా కన్పించడంలేదేం?"

"ఆఫీసులో పనెక్కువగా వుంది. ఈ ప్రభుత్వ పథకాలే మోగానీ కొత్తగా చేరిన నాలాంటివాళ్ళని తింటున్నారు."

"మంచి అభివృద్ధి పథకాలేగదుటోయ్. ప్రజల్లోనూ మంచి స్పందన ఉందని పేపర్లో చూస్తున్నాను."

"కార్యక్రమాలు మంచివే. కార్యరూపమే కుంటినడక నడుస్తోంది. సడెన్ డెసిషన్స్. ఎప్పుడు ఎక్కడ ఎవరి ప్రోగ్రాం వుంటుందో తెలియదు. రేపు ఉదయం కలెక్టర్ ప్రోగ్రాంకి ఈరోజు సర్క్యులర్స్ మారుమూల గ్రామాలకి చేరాలంటారు. ఏమిటో అంకుల్ చదివిన చదువుకి పొంతనలేని ఉద్యోగం."

"చేరి సంవత్సరమేగా. అప్పుడే ఇలా డీలాపడితే ఎలా?"

"ఏం చెయ్యమంటారంకుల్. ఆఫీసునుండి ఇంటికెళితే అప్పుల ఊబిలో దిగబడ్డట్టుంది. అమ్మకొచ్చే పెన్షన్‌తో అప్పులు తీరుస్తూ నా జీతంతో కుటుంబాన్ని గడుపుతున్నా ప్రతినెలా ఏదో ఒక అదనపు భారం. దాన్నుంచి కోలుకునేసరికి మరో నాలుగునెలలు పడుతోంది. జీవితం గానుగెద్దులా మారిపోయింది."

"ఈ అప్పులు, అదనపు భారాలు మనలాంటి మధ్య తరగతి వాళ్ళనే ఎప్పుడూ అంటిపెట్టుకుంటున్నాయెందుకో అర్థం కావడంలేదు. నా చిన్నతనం నుండీ చూస్తున్నాను. అప్పుడు మా నాన్న మోసిన భారం ఇప్పుడు నాకు హెరిడిటరీలా సంక్రమించిందేమో!" అన్నాను.

"చూడు సూర్యం. ఉన్నవాళ్ళు డబ్బు పడేసి తనక్కావాల్సింది కాళ్ళ దగ్గరికి తెచ్చుకుంటున్నారు. లేనివాడు ఆ రోజు తనక్కావాల్సింది చేతిలో వున్న డబ్బుతో చేజిక్కించుకుంటున్నాడు. ఈ రెండింట్లో ఏ తరగతికీ చెందని మధ్య తరగతి వాళ్ళం తింటున్నది పచ్చడి మెతుకులే అయినా అవి నిరంతరం ఉండాలని తలమునకలవుతున్నాం.

ఇన్‌స్టాల్‌మెంట్ హంగులూ, క్రెడిట్ కార్డులూ, పిల్లల చదువు'కొనే' కాన్వెంట్లు, వ్యసనాలు, అనారోగ్యాలు, ఆస్పత్రులు, బరువు బాధ్యతలు, ఒకటేమిటి... ఇవాళ సగటు మధ్య తరగతి మానవుడి జీవితం ఎదుగూబొదుగూలేని నాలుగంకెల జీతంతో ముడిబడిపోయింది.

సమస్యలతో జీవితంలో ప్రవేశించే నీలాంటి యువకుల్ని బాధ్యతలు బాహ్య ప్రపంచంవైపు దృష్టి మరల్చనీయడంలేదు.

ఒక్కసారి ఉద్యోగంలో ప్రవేశిస్తే అదే జీవితమనుకుంటున్నారు. అవసరాలకి అప్పుల్ని ఆశ్రయిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారేతప్ప చన్నీళ్ళకి వేణ్ణీళ్ళలా ఉపయోగపడే అందుబాటులో వున్న పనులవైపు కన్నెత్తి చూడడం లేదు.

యవ్వనంలో ఉన్నప్పుడు మనసు నిరాసక్తత, నిర్లిప్తతలు అలవర్చుకుంటే శరీరానికి సోమరితనం చేరువవుతుంది. సాధించాలన్న పట్టుదల వుంటే ఎక్కలేని ఎత్తులంటూ లేవు."

రాజారావుగారి మాటల్లోని చైతన్యపు నిజాల్ని నెమరువేసుకుంటూ ముందుకు నడుస్తున్న సూర్యం ఉద్యోగంలోకి ప్రవేశించకముందు ఆర్థికంగా ఆదుకున్న ట్యూషన్ సెంటర్‌ని పునఃప్రారంభించాలన్న దృఢ సంకల్పంతో ఇంటిముఖం పట్టాడు.

★